మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, వేదికపై కె.ప్రభాకర్ రెడ్డి, గౌస్‌దేశాయ్ తదితరులు

మొక్కుబడిగా జడ్‌పి సమావేశం

జడ్పి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టిజి భరత్

- మంత్రులు, ఎంపీలు డుమ్మా
- సభ మధ్యలో వెళ్లిన మంత్రి టిజి భరత్
- సర్పంచులను దొంగలన్న ఆదోని ఎమ్మెల్యే
- సభలో కాసేపు టెన్షన్ వాతావరణం
- ఆరుగురు ఎమ్మెల్యేలు మాత్రమే హాజరు

ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ప్రజా సమస్యలపై గళమెత్తాల్సిన ప్రజాప్రతినిధులు తమ ప్రభుత్వాలే గొప్ప అనుకుంటూ, ఎదుటి వారిని హేళన చేశారు.. వాస్తవంగా ప్రజా సమస్యలు కలిసి కట్టుగా పరిష్కరించుకుందామని హుందాగా వ్యవహరించే వారు కరువయ్యారు. సభలో సర్పంచులను దొంగలని అనడంతో గందరగోళం ఏర్పడింది. ఆదోని, నందికొట్కూరు ఎమ్మెల్యేలు అత్యుత్సాహం ప్రదర్శించారు. సభాధ్యక్షులు జడ్‌పి ఛైర్మన్, అధికారులను లెక్క చేయకుండా జడ్‌పిటిసిలపై విరుచుకుపడ్డారు.

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్‌పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన గ్రామీణ నీటి సరఫరా-పారిశుధ్యం, పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్ శాఖ, రోడ్లు, విద్యుత్ సమస్యలను ఎజెండాగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. అసలు విషయాలను పక్కదారి పట్టించేలా ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య జడ్‌పిటిసిలకు అడుగడుగునా అడ్డు తగిలారు. ఇద్దరు మంత్రులు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు సమావేశానికి డుమ్మా కొట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధులు గత ప్రభుత్వంలో సర్పంచులు దొంగలుగా దోచుకున్నారని, ఆ నిధులను వెనక్కు తెచ్చేలా విచారణ చేయించాలని ఆదోని ఎమ్మెల్యే ఆరోపించారు. దీంతో సభ గందరగోళమైంది. ఎమ్మెల్యే మాటలను వెనక్కు తీసుకోవాలని జడ్‌పిటిసిలు పట్టుబట్టారు. కానీ జడ్‌పిటిసిలనే భయపెట్టేలా ఎదురు దాడి చేశారు. చైర్మన్ పాపిరెడ్డి కలుగజేసుకుని ఎమ్మెల్యే అలా మాట్లాడకూడదంటూ జడ్‌పిటిసిలను శాంతింపజేశారు. ఆదోని ఎమ్మెల్యే చైర్మన్ అనుమతి తీసుకోకుండా మాట్లాడుతూ సర్పంచులు నిధులు ఏమి చేశారో ఆధారాలతో నిరూపిస్తానని సవాల్ విసిరారు. ఆధారాలతో రావాలని జడ్‌పిటిసిలు గట్టిగా చెప్పడంతో ఆ సమస్యను ప్రస్తావించడం మానేశారు. నందికొట్కూరు జడ్‌పిటిసి హస్టల్ సమీపంలోని మద్యం షాపును తొలగించాలని అడిగిన ప్రశ్నకు ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ వైసిపి పాలనలో గంజాయికి విద్యార్థులను బానిసలను చేశారని ఆరోపించారు. దీంతో కొంతసేపు సభ గందరగోళమైంది. నంద్యాల కలెక్టర్ కలుగజేసుకుని నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపు ఉంటే తొలగిస్తామని చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

ఈ సమావేశంలో కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష, నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, కురువ రాష్ట్ర చైర్మన్ దేవేంద్రప్ప, వాల్మీకి కార్పొరేషన్ చైర్పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, కర్నూలు జెసి బి.నవ్య, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ట్రైనీ కలెక్టర్లు చల్లా కల్యాణి, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, డిప్యూటీ సిఇఒ వెంకట సుబ్బారెడ్డి, ఉమ్మడి జిల్లా జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాల పనులు నాణ్యతగా చేయాలి
- మంత్రి టిజి భరత్

గ్రామీణ నీటి సరఫరా చర్చలో మంత్రి భరత్ మాట్లాడుతూ రక్షిత మంచినీటి పథకాలకు సంబంధించి మరమ్మతు పనులు నాణ్యతతో జరిగేలా చూడాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. నందికొట్కూరు ఎమ్మెల్యే సిపిడబ్ల్యుసి మరమ్మతు టెండర్లపై మాట్లాడిన నేపథ్యంలో మంత్రి మాట్లాడుతూ టెండర్లలో 30-40 శాతం తక్కువ చేసి కోట్ చేస్తే పనులు ఏ విధంగా నాణ్యతతో చేస్తారని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇని ప్రశ్నించారు. 20 శాతం తక్కువ చేసి కోట్ చేస్తేనే పనులు నాణ్యతతో ఉండవని, అలాంటిది సుమారు 40 శాతం మేరకు తక్కువ చేస్తే ఏ విధంగా నాణ్యతతో చేస్తారని అధికారులను ప్రశ్నించారు. రెండు నెలల నుంచి ఎమ్మెల్యే ఈ అంశంపై ప్రశ్నిస్తున్నా ఎందుకు చర్య తీసుకోలేదని అధికారులను ప్రశ్నించారు. ఈ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు చెప్పిన సమస్యపై వెంటనే స్పందించి అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ జలజీవన్ మిషన్ కింద రూ.25 కోట్లు మంజూరు చేశారని, గత ప్రభుత్వం ఇందులో కేవలం రూ.2 కోట్లు మేరకు మాత్రమే వాడుకుందన్నారు. మార్చిలోపు ఈ స్కీమ్ పూర్తి అవుతుందన్న నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి ఇంకా రెండు సంవత్సరాల వరకు పొడిగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారన్నారు. అనుమతులు వచ్చేలోపు ముందుగానే డిపిఆర్‌లు తయారు చేసుకొని సిద్ధంగా ఉంటే, పనులు చేసుకునే అవకాశం ఉంటుందని సూచించారు. నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ కొత్తమద్దుగుల-గుమ్మడపురం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పనులు పూర్తిచేయాలని కోరారు.

ఆదోని ఎమ్మెల్యే మాటలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జడ్‌పిటిసిలు

సమస్యలపై గళమెత్తిన జడ్‌పిటిసిలు

కొత్తపల్లి జడ్‌పిటిసి మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు కొరత ఉందన్నారు. విద్యా వాలంటీర్లను నియమించాలని కోరారు. కర్నూల్ జడ్‌పిటిసి, నంద్యాల ఎంపిపి, ఆస్పరి, సి.బెళగల్ జడ్‌పిటిసిలు, ఎంపిపి, దొర్నిపాడు, కోసిగి, జూపాడుబంగ్లా, కోడుమూరు జడ్‌పిటిసిలు వారి మండలాల్లోని సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. కలెక్టర్, సంబంధిత అధికారులు సమాధానం చెప్పారు.

హస్టల్ వద్ద వైన్ షాపును తొలగించాలంటున్న జడ్‌పిటిసి, అడ్డుతగిలిన ఎమ్మెల్యే

హస్టల్ వద్ద ఉన్న మద్యం షాపును తొలగించాలి

నందికొట్కూరు జడ్‌పిటిసి షేక్ సలీమున్నీసా మాట్లాడుతూ బాలుర హస్టల్ దగ్గరగా వైన్‌షాప్ తీసివేయాలని కోరారు. ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ మీ ప్రభుత్వంలో ఇంతకంటే దారుణంగా పని చేశారని ఆగ్రహించారు. కలెక్టర్ జి.రాజకుమారి కలుగజేసుకుని అక్కడ వసతులను లోబడి వైన్ షాప్ లేకుంటే వెంటనే తొలగిస్తామని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేలు, ఎంపీలు డుమ్మా

ఉమ్మడి జిల్లాలో 14 మంది ఎమ్మెల్యేలు 2 ఎంపీలు ఉన్నారు. వీరిలో ఐదుగురు ఎమ్మెల్యేలు, మంత్రి భరత్ తప్ప మిగిలిన వారు హాజరుకాలేదు. వచ్చిన ఐదుగురు ఎమ్మెల్యేలలో పత్తికొండ, కోడుమూరు ఎమ్మెల్యేలు అలా వచ్చారు ఇలా వెళ్లారు. మంత్రి భరత్ సైతం సభ మధ్యలోనే వెళ్లిపోయారు. ప్రజాసమస్యలపై మాట్లాడాల్సిన సభకు కనీసం సమయాన్ని వెచ్చించలేని దుస్థితిలో ప్రజాప్రతినిధులు ఉన్నారని సభ్యులు చర్చించుకున్నారు.

సోలార్ కుంభకోణంపై నోరు మెదపని మోడీ

- రాష్ట్ర అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేని చంద్రబాబు
- సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు ఎంఏ గఫూర్
- నిత్యవసర ధరలు తగ్గించడంలో విఫలం: కె.ప్రభాకర్‌రెడ్డి
- సిపిఎం ఓల్డ్ సిటీ మహాసభ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సోలార్ విద్యుత్ అవినీతి కుంభకోణంపై పార్లమెంట్లో ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నా నరేంద్ర మోడీ మాత్రం నోరు మెదపడం లేదని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ అన్నారు. చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి చేయడంలో కూడా చంద్రబాబు విఫలమయ్యారన్నారు. ఆదివారం సాయంత్రం పాతబస్తీలోని ఖిల్లా చెట్టు ప్రాంతంలో సిపిఎం ఓల్డ్ సిటీ మహాసభ ప్రారంభం అయింది. తొలిరోజు ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ఎం.ఎ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి ,జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల పాల్గొన్నారు. ఎంఏ గఫూర్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ముస్లిం మైనారిటీల పైన పెద్దఎత్తున దాడి చేస్తుందన్నారు. మైనారిటీ హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. చంద్రబాబు కూడా బిజెపికి వత్తాసు పలకడం దుర్మార్గమన్నారు. సోలార్ కుంభకోణంలో ఆదాని రూ.లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డారని, అమెరికాలో ఎఫ్‌బిఐ కేసు నమోదు చేసిందన్నారు. అందులో జగన్మోహన్ రెడ్డి పాత్ర కూడా ఉన్నట్టు గుర్తించిందన్నారు. రెండు కోట్ల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రకటించి ఇప్పటివరకు ఒక్కరికి కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించలేదన్నారు. రాష్ట్రంలో వెనుకబడినటువంటి రాయలసీమ ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు వేదవతి గుండ్రేవుల ప్రాజెక్టులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కె. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఒకే దేశం ఒకే పార్టీ ఉండేలా విధానాలను అనుసరిస్తుందన్నారు. జిఎస్‌టి ద్వారా నిత్యవసర ధరలు తగ్గుతాయని ప్రకటించినా నానాటికి పెరిగిపోతున్నాయని తగ్గడం లేదన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించడం లేదన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సిపిఎం నారా చంద్రబాబు ధరలు తగ్గించడంలో చేతులు రావడం లేదని, మద్యం ధరలు మాత్రం తగ్గించారన్నారు. రాష్ట్ర బడ్జెట్లో కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధికి నిధుల కేటాయింపుల్లో గుండుసున్నా మాత్రమే చుట్టారన్నారు. ఒర్వకల్లు పారిశ్రామిక వాడలో పరిశ్రమలను నెలకొల్పి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ కర్నూలు నగరంలో పలు సమస్యలను పరిష్కరించాలని సిపిఎం అనేక పోరాటాలు చేసిందన్నారు. గతంలో ఎమ్మెల్యే గఫూర్ ఆయాంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ట్యాంకులు నిర్మించారన్నారు. జగన్నాథ గట్టులో నిరుపేదలకు గృహాలను మంజూరు చేస్తే ఇప్పటికీ అక్కడ ఎలాంటి వసతులను కల్పించలేదన్నారు. రానున్న రోజుల్లో కర్నూలు నగరంలో నెలకొన్న సమస్యలపై రాజీలేని పోరాటాలను నిర్వహిస్తామన్నారు. ప్రజానాట్య మండలి కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు సుభాన్, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్.ఎన్.వి.సిపిఎం న్యూ సిటీకార్యదర్శి రాముడు, సిపిఎం ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు విజయ్, అబ్దుల్ దేశాయ్, షరీఫ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభకు హాజరైన కార్యకర్తలు, ప్రజలు

సంక్రాంతి నాటికి పల్లె పండగ పనులు పూర్తి

- జిల్లా వ్యాప్తంగా రూ.70 కోట్లు మంజూరు
- 830 పనుల్లో 430 పనులు పూర్తి - రాష్ట్రంలో రెండవ స్థానంలో కర్నూలు
- ప్రజాశక్తితో పంచాయితీ రాజ్ ఎస్ఇ రామచంద్రా రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

'జిల్లా వ్యాప్తంగా పల్లె పండుగలలో భాగంగా పంచాయితీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు వేగవంతంగా చేస్తున్నామని జిల్లాలో 830 పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే 430 పనులు పూర్తి చేశాం. సంక్రాంతి పండుగకు అన్ని పనులను పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం. జిల్లాకు రూ.70 కోట్లు మంజూరు అయ్యాయి. రాష్టంలోనే కర్నూలు జిల్లా రెండవ స్థానంలో ఉంది.' అని పంచాయితీ రాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ రామచంద్రారెడ్డి ప్రజాశక్తి తో ముఖాముఖిలో వెల్లడించారు.

జిల్లాలో పల్లె పండుగకు ఎన్ని పనులు ప్రారంభించారు. నిర్దేశిత సమయం ఉందా?ఎప్పటికి పూర్తి అవుతాయి.

ఎస్ఇ : జిల్లాలో అక్టోబర్ 14న పల్లెపండుగా కార్యక్రమాలు నిర్వహించాం. అందులో గ్రామసభలు ద్వారా పనులను ఎన్నుకున్నాం. మొత్తం 830 పనులకు గాను రూ.70 కోట్లు మంజూరు అయ్యాయి. ఇందులో 811 పనులు ప్రారంభించాం. ప్రస్తుతం 430 పనులు పూర్తి చేశాం. మిగతా పనులు చివరి దశలో ఉన్నాయి. చాలా వేగవంతంగా పనులు చేస్తున్నాం. సంక్రాంతి పండుగకు పల్లె పండుగ పనులన్నీ పూర్తి చేసేలా లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఆ సమయం లోపు పూర్తి చేస్తాం.

పనుల ఎంపిక ఎలా చేశారు? ఎలాంటి అభివద్ధి పనులు నిర్వహిస్తున్నారు.?

ఎస్ఇ: జిల్లాలో పల్లెపండుగ కింద సిసి రోడ్లు, అంతర్గత రోడ్ల నిర్మాణం, అప్రోచ్ రోడ్లు, రహదారి లేని గ్రామాలకు రోడ్లు వేయడం కోసం ప్రధానంగా చేస్తున్నాం. కాంపౌండ్ వాల్స్, ఈ పనులన్నీ గ్రామ సభలు నిర్వహించి తీర్మానం చేశాక మండల కమిటీలు జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ తీర్మానం అయ్యాక నిర్వహిస్తున్నాం.

చాలా గ్రామాల్లో సర్పంచుల సంతకాలు లేకుండా వారి అభిప్రాయం లేకుండా చేస్తున్నారని ప్రచారం ఉంది. నిజమేనా?

ఎస్ఇ: పల్లెపండుగను జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారు. గ్రామ సభలో తీర్మానం అందరి సమక్షంలో చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం 215 జిఒ ప్రకారం సర్పంచులకు ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలు అందరికి విషయం తెలియపరుస్తాం. వారి అభిప్రాయం ఏదైనా 15 రోజుల తరువాత ఆ పనులను ప్రారంభిస్తారు. చేసే పనులను ఆయా గ్రామ సచివాలయంలో తెలిసేలా అవిష్కరిస్తున్నాం.

గ్రామాల్లో వైసిపి సర్పంచులు ఉన్న చోట సమస్యలేమైనా ఉన్నాయా?

ఎస్ఇ: దాదాపు ఎక్కడ ఇలాంటి సమస్య లు లేవు. ఆలూరు,మంత్రాలయం నియోజకవర్గాల్లో కొన్ని గ్రామాల్లో ఇలాంటి సమస్య ఉంది. సాధ్యమైనంత వరకు ఎలాంటి సమస్యలు లేకుండా చేయడం కోసం చూస్తున్నాం. ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించి పనులు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

జిల్లాలో చాలా రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. వాటి పరిస్థితి ఎలా అధిగమిస్తారు.?

ఎస్ఇ: 830 పనుల్లో 813 పనులు అంతర్గత రహదారులు,11 సిసి రోడ్లు,6 బిటి రోడ్లు మంజూరు అయ్యాయి. వీటిని విజయవంతంగా పూర్తి చేసి అవసరమైతే రెండవ దఫా మిగిలిన రోడ్లు వేసేలా ఉన్నతాధికారులు, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం.

అభివృద్ధి జరుగుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పరిశీలిస్తున్నారా?

ఎస్ఇ: జరుగుతున్న ప్రతి పనిని క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నాం. క్వాలిటీ కంట్రోల్ వారి ద్వారా పరిశీలించగా పనుల క్వాలిటీని బట్టి నివేదించాక మాత్రమే తదుపరి పనులు చేపడుతున్నాం.

గతంలో చాలా పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.? ఇప్పుడెలా చేస్తున్నారు.

ఎస్ఇ: ప్రస్తుతం పల్లెపండుగలో భాగంగా నిర్వహిస్తున్న ప్రతి పనికి ప్రతి వారం బిల్లులు మంజూరు చేస్తున్నాం. ఎలాంటి జాప్యం లేకుండా ఎప్పటి పనికి అప్పుడు బిల్లులు మంజూరు అవుతుంది.కాంట్రాక్టర్లకు ఎలాంటి బిల్లుల సమస్యలు ,ఇబ్బందులు లేవు. అలాంటివి ఎక్కడైనా ఉంటే నా దృష్టికి తీసుకురావచ్చు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులుం

డ్రోన్ కెమెరాతో గట్టి నిఘా

19 ఒపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు -జిల్లాలో విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లా ఎస్‌పి జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు కర్నూలు డిఎస్‌పి జె.బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు పట్టణంలో నేర నివారణ లక్ష్యంగా పోలీసులు డ్రోన్ కెమెరాలతో విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సంధర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని కర్నూలు నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని శరీన్‌నగర్ , వక్కేరవాగు, ఆర్‌టిసి బస్టాండ్ తదితర ప్రదేశాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాల పై డ్రోన్ కెమెరా ద్వారా గట్టి నిఘా ఉంచారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 19 మందిని కర్నూలు ట్రాఫిక్ పోలీసులు, కర్నూలు నాల్గవ పట్టణ పోలీసులు కలిసి అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల పై ,బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారి పై నిరంతరం పర్యవేక్షణ నిఘా కొనసాగుతుందని పోలీసు అధికారులు తెలిపారు. కర్నూలు ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్, కర్నూలు 4వ పట్టణ ఎస్ఐ గోపినాథ్, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ హుస్సేన్ పాల్గొన్నారు.

26 లోపు సభ్యత్వం పూర్తి చేయాలి

టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఈనెల 26 తేదీలోపు టిడిపి సభ్యత్వం కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. టిడిపి జిల్లా సమన్వయకమిటీ సమావేశం ఆదివారం జిల్లా టిడిపి కార్యాలయం, కర్నూలు అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి పార్లమెంట్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, రాష్ట్ర మంత్రి టిజి.భరత్, ఎమ్మెల్యే కెఇ.శ్యాంకుమార్, బొగ్గుల దస్తగిరి, నియోజకవర్గం పార్టీ ఇన్చార్జీలు బి.వీరభద్రాగౌడ్, ఎన్.రాఘువేంద్రా రెడ్డి, చైర్మన్లు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కప్పట్రాళ్ళ బొజ్జమ్మ, దేవేంద్రప్ప హాజరయ్యారు. సమావేశంలో ప్రధానంగా గత అక్టోబర్ 26న పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదేశానుసారం ప్రారంభమయిన పార్టీ సభ్యత్వ నమోదుపై ప్రధానంగా చర్చించారు. ఇప్పటి వరకు జిల్లాలో పార్టీ సభ్యత్వ కార్యక్రమం మొత్తం 1,90073 పూర్తి చేశారన్నారు. నియోజకవర్గాల వారీగా ఆదోని 18896, ఆలూరు 40765, కోడుమూరు - 18218, కర్నూలు - 28229, మంత్రాలయం- 32556, 23964, ఎమ్మిగనూరు - 27445 ఇప్పటి వరకు ఈ ప్రకారం సభ్యత్వం పూర్తి చేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈనెల 26న వరకు ఉన్నందున కర్నూలు జిల్లా పరిధిలోని మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు రాష్ట్ర/ జిల్లా పార్టీ అనుబంధ కమిటీల నాయకులు మండల/పట్టణ, నగర కమిటీల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, అనుబంధ కమిటీల నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జీలు వారి పరిధిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తి అయిన తర్వాత పార్టీని నిర్మాణాత్మకంగా తయారు చేసుకునేందుకు పార్టీ సంస్థాగత ఎన్నికలు (గ్రామ/వార్డు/మండల/పట్టణ/ జిల్లా) స్థాయి కమిటీలను రూపకల్పన ఉంటుందని, కనుక నాయకులు ఈ కమిటీలలో నియమించబడాలంటే ఖచ్చితంగా పార్టీ సభ్యత్వం కలిగి ఉండాలన్నారు. ఈ విషయాన్ని గుర్తించుకొని ప్రతి నాయకుడు, కార్యకర్త ఖచ్చితంగా పార్టీ సభ్యత్వం చేసుకోవాలని కోరారు. సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5లక్షల మేరకు ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. నాయకులు, కార్యకర్తలు వీలైనంత మేరకుఈనెల 26లోగా పార్టీ క్రియాశీలక సభ్యత్వం పొందాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు పి.తిక్కారెడ్డి, టిజి.భరత్

ఉపాధిలో స్వల్ప ఆక్రమాలు

గ్రామ సభలో వెల్లడి

ప్రజాశక్తి- సి బెళగల్

సి బెళగల్ మండలంలో ఉపాధి పనులపై ఎస్ఆర్‌పి విజయ్ భాస్కర్ డి ఆర్‌పి విల్సన్ సమక్షంలో 2023-2024 ఉపాధి సామాజిక తనిఖీ నిర్వహించారు. ఆదివారం సి.బెళగల్‌కు సంబంధించి సచివాలయంలో సర్పంచు పాండురంగన్న, హార్టికల్చర్ వీతేంద్రరెడ్డి సమక్షంలో గ్రామ సభ నిర్వహించారు. ఇచ్చిన మొక్కలు చనిపోతే తిరిగి నాటించాలని అట్లయితేనే బిల్లులు మంజూరు చేయాలని అన్నారు. సి బెళగల్ కు రూ.కోటి 54 లక్షల 68 వేలు ఖర్చు చేయగా సుమారు 124 పనులను వినియోగించుకొన్నారని స్వల్ప అక్రమాలు ఉన్నట్లు వెల్లడి చేశారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఓర్వకల్లు మండలంలో ప్రజా సంఘాల ఆఫీసులో మండల కార్యదర్శి జి.శ్రీధర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ, మండల అధ్యక్షులు షాజహాన్, భవన నిర్మాణా సంఘం మండల నాయకులు వి.సుధాకర్ పాల్గొన్నారు. పిఎస్.రాధాకృష్ణ మాట్లాడుతూ ఆసంఘటిత కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఆటో కార్మికులకు బ్యాంకు సౌకర్యం కల్పించాలన్నారు. పెండింగులో ఉన్న స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలన్నారు. మండలంలో పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు రక్షణ కల్పించాలన్నారు. మండలంలో ఉన్న యువతకు 75శాతం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు ఎస్.షాజహాన్, కార్యదర్శిగా జి శ్రీధర్, మండల ఉపాధ్యక్షుడిగా వి.సుధాకర్, ధనుంజయుడు, సరళ,సువర్ణ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా మద్దయ్య, రాజు, అశోక్, నాగభూషణం, శేఖర్, మహబూబ్‌బాష, నాగభూషణ్ నాయక్, శోభారాణి, శ్యామలను ఎన్నుకున్నారు.

ఘనంగా గౌరు దంపతుల వివాహ వార్షికోత్సవం

ప్రజాశక్త-కర్నూలు హాస్పిటల్

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గౌరు చరిత, వెంకట రెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి యువ నాయకులు గౌరు జనార్ధన్ రెడ్డి, నాయకులు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, పెరుగు దుర్గాప్రసాద్ రెడ్డి, అడ్వకేట్ నాగ ముని, యశ్వంత్‌రెడ్డి,నాగరాజు, కొంగనపాడువినోద్, మహేష్ ఆచారి, పెద్దయ్య, ఈరన్న గౌడ్ తదితరులు పాల్గొని వారితో కేక్ కట్ చేయించి పూల మాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.

కబ్జాకోరులపై ఎందుకింత ప్రేమ

-ప్రభుత్వం మారినా కబ్జాదారుల రాజ్యమేనా ?
-ఆందోళన చేసినా..అధికారులు స్పందించరేంటి
-పిపిఎస్ఎస్, వివిధ కాలనీల నాయకుల సూటి ప్రశ్న

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరవనం రోడ్డు, చెరువుకు చెందిన అలుగును ఆక్రమించిన బిల్డర్‌పై అధికారులు చర్యలు తీసుకోకుండా ఎందుకింత ప్రేమ చూపుతున్నారని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి ప్రశ్నించారు. ఆదివారం ఆ సంఘం నాయకులతోపాటు వివిధ కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు ఎం.నాగరాజు, మహమ్మద్ యూనుస్, బి.నాగేంద్ర, సిహెచ్.మహేష్, బి వన్నూరు సాహెబ్ , వివిధ కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులతో కలిసి పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం నగరవనం, గార్గేపురం చెరువు ప్రాంతాల్లో పర్యటించింది. ఆహ్లాదకరమైన అందాలను, రోడ్లను, చెరువుకు చెందిన వాగును బత్తుల బిల్డర్ కబ్జా చేసిన విషయాన్ని గురించి ఆందోళన చేసి అర్జీలిచ్చినా.. అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం మారినా బిల్డర్ల రాజ్యమేనా? భారీ వర్షాలు వచ్చినప్పుడు చెరువు నిండి వరద నీరు వెళ్లే దాదాపు 200 అడుగుల వాగు(అలుగు)ను ఆక్రమించుకొని 20 అడుగుల విస్తీర్ణంతో బ్రిడ్జి నిర్మించారన్నారు. చెరువు నుండి వచ్చే నీటిని దారి మళ్ళించారన్నారు. గతంలో తుఫాను వచ్చినప్పుడు వరద నీరు పోయే దారి లేక మొత్తం నీరు వెనక్కి వచ్చి నగరవనం వెళ్లే సిమెంటు రోడ్డు కింద ఉండే మట్టి అంతా కోతకు గురైందన్నారు. సిమెంట్ కూలిపోయే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. ఆర్‌అండ్ బి రోడ్డు వెంట పెద్ద పెద్ద బోర్డులు ఏర్పాటు చేసినందున వాహనదారులకు ఇబ్బందిగా మారిందన్నారు. గత ప్రభుత్వం స్పందించలేదని, కూటమి ప్రభుత్వమైనా స్పందించి బిల్డర్ పై చర్య తీసుకుని కబ్జాల నుండి ఆ ప్రాంతాన్ని కాపాడాలని కోరారు. ఈ పర్యటనలో షేక్ అన్వర్‌బాష, బి.వెంకటరమణ, ఎస్ఆర్.గౌడు, ఎన్.పీటర్, సి.మధు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురయిన నగరవనం రోడ్డు పరిశీలిస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు

ప్రమాదాలకు నిలయం ఏరూరు రహదారి...

-అడుగు అడుగున కంకర తేలిన గుంతలు -వాహనాలు నడపాలంటే నరకయాతన
... నిత్యం వాహనాలలో ప్రయాణించే విద్యార్థుల మనోవేదన
.. రోడ్డు మరమ్మతు చేయాలని కోరుతున్న స్థానిక సర్పంచు, ప్రజలు

ప్రజాశక్తి -చిప్పగిరి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రహదారులను బాగు చేయడానికి కోట్ల నిధులను వెచ్చిస్తున్నామని ప్రకటనలు గుప్పిస్తున్నా మారుమూల ప్రాంతాలకు వెళ్ళు రహదారులన్నీ కూడా చాలా అధ్వానంగా మారి ప్రయాణించాలంటే కూడా భయపడే పరిస్థితి దాపురించింది. రోడ్ల పరిస్థితి బాగలేక ఏరూరు, డేగులపాడు, మల్లికార్జున పల్లి, కమర్చేడు ప్రజలు ఆవేదన చెందుతున్నారు. చిప్పగిరి నుంచి డేగులపాడు వరకు దాదాపు 14 కిలోమీటర్లు ప్రయాణించాలంటే ప్రమాదాలను కొనితెచ్చుకోవడమేనని ఈ గ్రామాల ప్రజల ఆందోళన చెందుతున్నారు. ద్విచక్ర వాహనంలో వెళ్లినా కంకర తేలిన గుంతలను తప్పించడానికి ఇబ్బందులు పడి కడుపునొప్పి వచ్చేలా ఉంటుందని పలు వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల ఇద్దరు అధికారులు స్కూటీపై వెళ్తూ అదుపు తప్పి కింద పడ్డారు. వారు బయటకు చెప్పుకోలేక పోయారు. నిత్యం పొలాలలో పనులు చేసుకోవడానికి పలు గ్రామాల నుంచి ఆటోలలో వస్తున్న కూలీలు పరిస్థితి ఎంత ఇబ్బందిగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఎన్నో సంఘటనలు కూడా కూలీలు వెళ్లే ఆటోలు ప్రమాదాలకు గురి అయ్యి కూలీలు చనిపోయిన దశ్యాలు మన కళ్లెదురుగే కనబడుతున్నాయి. అయినా మన ఆర్‌అండ్‌బి అధికారులకు అవి కళ్ళకు కనపడవు. రహదారికి మరమ్మతులు చేయాలని రహదారి వెంట నిత్యం ప్రయాణించే ప్రజలు విద్యార్థులు, వృద్ధులు,బాలింతలు ఎంత ఇబ్బందులు పడుతున్నారో వాస్తవాలు చూసామని సర్పంచి ఆవేదన చెందారు. గత వారం కిందట జరిగిన సర్వసభ్య సమావేశంలో కూడా ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు కూడా వారి కళ్ళతో చూస్తే అర్థమవుతుందని ప్రజలు తెలుపుతున్నారు. పూర్వకాలం నుంచి కూడా చిప్పగిరి నుంచి ఏరూరు,

కంకర తేలి గుంతలుపడిన ఏరూరు రహదారి

డేగల పాడు, కమ్మరిచేడు గ్రామాల మీదుగా బళ్లారికి తక్కువ సమయంలో ప్రయాణం చేరుకోవడానికి వెసులుబాటు ఉండేదని వయసు మళ్ళిన పెద్దలు తెలుపుతున్నారు. ఇప్పటికైనా మా ఆవేదన ను అర్థం చేసుకొని స్థానిక ఎమ్మెల్యే అయిన కూటమి ప్రభుత్వం ఇంచార్జ్ అయిన చొరవ తీసుకోవాలంటున్నారు. ఉమ్మడి జిల్లాల మంత్రి అయిన బిసి జనార్ధన్ రెడ్డితో కలిసి ఉన్న సమస్యను వివరించి నిధులు మంజూరు చేయించి సమస్యను పరిష్కరించాలని ఏరూరు ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలని ఎన్నోసార్లు విజ్ఞప్తి చేశాం: సర్పంచ్ వెంకటలక్ష్మి

ఏరూరు గ్రామం నుంచి నిత్యం విద్యార్థులు, ప్రజలు ఆస్పత్రికి వెళ్లేవారు చిప్పగిరికి గుంతకల్లుకు ప్రయాణం చేయవలసి ఉంది. ఈ రహదారిలో ప్రయాణం అంటే అందరికీ భయమేస్తుంది. ఎన్నోసార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా రహదారి అంతా కూడా మరమ్మతులు వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు ఆర్‌అండ్‌బి ఉన్నతాధికారులను కోరుతున్నాం.

‘తొలకరి జల్లులు’ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూర్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న ప్రముఖ బాల సాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్న రచించిన 58వ పుస్తకం ‘తొలకరి జల్లులు’ పుస్తకావిష్కరణ చిత్తూరు హరివిల్లు లలిత కళావేదిక ఆధ్వర్యంలో విజయం డిగ్రీ కళాశాలలో నాయుడు బిల్డింగ్, మిట్టూరు–చిత్తూరులో ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. ‘తొలకరి జల్లులు’ ఈ పుస్తకం హరివిల్లు గౌరవాధ్యక్షులు కట్టమంచి బాల కృష్ణారెడ్డి, సభాధ్యక్షులు భాస్కర్ రెడ్డి, కృతి స్వీకర్త శ్రీ వల్లేరి హరి నాయుడు, విశ్రాంత అటవీశాఖ అధికారి ఎఎల్ కృష్ణారెడ్డి, విశ్రాంత జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ పిళ్ళై విచ్చేసిన ప్రముఖుల చేతుల మీద ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ వల్లేరి హరి నాయుడు దంపతులకు అంకితం చేశారు. అనతి కాల వ్యవధిలో 60 పుస్తకాలు రాసి ముద్రించిన గద్వాల సోమన్నను సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ

తొలకరి జల్లులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

పద్య కవి పత్తిపాటి రమేష్, గానకోకిల సుగుణ మద్దిరెడ్డి, ప్రముఖ రచయిత్రి అరుణ కుమారి, హరివిల్లు కార్యవర్గం గోవింద్, మునిస్వామి, ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు, సాహితీ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్‌ను విడుదల చేస్తున్న మానవ హక్కుల వేదిక నాయకులు

14న మానవ హక్కుల వేదిక మహాసభ

ప్రజాశక్తి - ఆదోని

ఈ నెల 14, 15న అనంతపురంలో నిర్వహించే మానవ హక్కుల వేదిక రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యాజీ శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి దేవేంద్ర బాబు తెలిపారు. కొత్త బస్టాండ్ దగ్గర నేషనల్ జూనియర్ కాలేజీలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఉరుకుందప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చేనేత హస్త కళల ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

చేనేత కళాకారులను, హస్తకళలను, కళాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజ్యసభ మాజీ సభ్యులు టిజి. వెంకటేష్ అన్నారు. ఆదివారం నంద్యాల చెక్‌పోస్ట్‌లో కళాభారతి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చేనేత, హస్తకళల వస్తు ప్రదర్శనశాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. టిజి. వెంకటేష్ మాట్లాడుతూ కళాకారుల కళకు వెలకట్టలేమని, వారు తయారు చేసిన వస్తువులను కొనుగోలు చేసి ప్రతి ఒక్కరు వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పెద్ద పెద్ద షోరూంలలో వీటి విలువ ఎంతో ఎక్కువగా ఉంటుందని, అటువంటిది తయారీదారులే స్వయంగా ప్రదర్శనశాలలో అమ్ముకోవడం వల్ల ఎటువంటి ట్యాక్స్ లేకుండా ఎంతో తక్కువ ధరకు మనకు వస్త్రాలు, వస్తువులు లభిస్తున్నాయని అన్నారు. ఇటువంటి ప్రదర్శనశాలల వల్ల మన ప్రాంతంలో తయారయ్యే వస్తువులే కాకుండా దేశ నలుమూలల నుండి నైపుణ్యం పొందినటువంటి కళాకారుల చేతులలో తయారైన వస్తువులు మనకు

చేనేత హస్త కళల ప్రదర్శనను రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న టిజి.వెంకటేష్

అందుబాటులోకి వస్తున్నాయని టిజి.వెంకటేష్ అన్నారు. ఈనెల 19 వరకు ఉండే చేనేత వస్తు ప్రదర్శనశాలను కర్నూలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనిల్, సత్యనారాయణ, కిషోర్, కృష్ణ, శ్రీరామ్, హుస్సేన్, మాజీ డిఎస్‌పి మహబూబ్ బాష, నాగేశ్వర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు

ప్రజాశక్తి - ఆస్పరి

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజినేయులు, కేవి.నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు హనుమంతు, వీరశేఖర్‌లు కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. ఆదివారం మండలంలోని చిరుమాన్ దొడ్డి గ్రామంలో సిపిఎం మండల 7వ మహాసభను బాలక్రిష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సిపిఎం సీనియర్ నాయకులు మాణిక్యప్ప పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పలువురు అమరువీరులకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో అత్యంత వెనుకబడిన ఆలూరు నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఈ ప్రాంతం నిత్యం కరువు కాటకాలతో ప్రజలు సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ఆస్పరి మండలం నుంచి తెలంగాణ, రాయచూర్, బెంగళూరు, కడప ప్రాంతాలకు అత్యధికంగా వలసలు వెళుతున్నారన్నారు. వలసలను నివారించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడ్డారు. వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులు నిర్మించి ఆలూరు తాలూకాలోని ఆరు మండలాలకు సాగు, తాగునీరు అందిస్తే వలసలను నివారించడమే కాక అన్నదాతలు పంటలు పండించవచ్చన్నారు. కూటమి ప్రభుత్వం ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించి,

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు

వేదవతి ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మల్లేష్, చిన్న సుంకన్న, చిన్న మల్లేష్, నరసింహులు, మహిళా నాయకురాలు మహేశ్వరి లు పాల్గొన్నారు.

సిపిఎం నూతన కమిటీ ఎన్నిక : సిపిఎం మండల కార్యదర్శిగా బాలక్రిష్ణతో పాటు 9 మంది కమిటీ సభ్యులు రంగస్వామి, రామాంజనేయులు, రవి, ఈరన్న, మధు రెడ్డి, పెద్ద వీరభద్రి, రవి, ఏసుబ్, శేఖర్‌లను ఎన్నుకున్నారు.

వైసిపి నుండి టిడిపిలోకి 100 మంది

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం మండలం కుంబళనూరు గ్రామ సర్పంచు వీరేష్, ఎంపిటిసి సభ్యులు ముత్తన్న, రేషన్ డీలర్ ఈరన్న గౌడ్‌తోపాటు టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కౌతాళం మండలం సీనియర్ నాయకులు చెన్నబసప్ప ఆధ్వర్యంలో ఆదివారం 100 మంది వైసిపి నాయకులు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వైసిపి పార్టీకి భారీ షాక్ తగిలింది. వీరికి టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కుంబళనూరు గ్రామానికి చెందిన మంత్రాలయం నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి ముఖ్య అనుచరులు గ్రామ సర్పంచు వీరేష్, ఎంపిటిసి సభ్యులు ముత్తన్న, రేషన్ డీలర్ ఈరన్న గౌడ్‌తో పాటు 100 మంది వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరారు. అనంతరం టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి


జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి కార్యకర్తలు , నాయకులు

మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ కార్యదర్శి రహిమాన్, ఎస్సిసెల్ జిల్లా కార్యదర్శి రాజాబాబు, బిసి సాధికారిక రాష్ట్ర సభ్యులు సిద్ధా తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మఠంలో కర్ణాటక మంత్రి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం రాఘవేంద్రస్వామిని కర్నాటక రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి చలువరాయస్వామి ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం సహాయక పిఆర్‌ఒ హొన్నాళ్ళి వ్యాసరాజాచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని హారతులు స్వీకరించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు వారికి శేష వస్త్రం ఫల మంత్రాక్షతలు జ్ఞాపకను అందజేసి ఆశీర్వదించారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆదోని రూరల్

ఆదోని మండలం పెద్దతుంబలం గ్రామంలోని నేషనల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు సందీప్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ సైపుల్లాలు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్య, వైద్యం, క్రీడ నైపుణ్యం, మహిళల ఆర్థిక అభివృద్ధి తదితర సామాజిక సేవలో భాగంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి వచ్చిన వారికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు జీవన్ సింగ్, భరత్ షా, శ్రీధర్ రెడ్డి, సుబ్బయ్య, హుస్సేన్ భాష, సాబీర్ భాష,

శివరాం, నితిన్, వినోద్ జైన్, రాజేష్ జైన్, శేషయ్య, రాజేష్, నితీష్ గాంధీ, వికాస్ గాంధీ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వినియోగదారుల రక్షణ మండలిలో ఈసా బాషాకు చోటు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని వినియోగదారుల రక్షణమండలి అధ్యక్షులు ఈషా బాషాకు జిల్లా వినియోగదారుల రక్షణ మండలిలో ప్రత్యేకంగా చోటు కల్పిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆదోని సబ్ కలెక్టర్ భరద్వాజ్‌తో కలిసి నియామక ఉత్తర్వులు అందజేశారు. కర్నూలు జిల్లా వినియోగదారుల రక్షణ మండలిని ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. నూతనంగా ఎన్నికైన మండలి సభ్యులు జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఇంఛార్జి నదీమ్ హుసేన్‌కు కృతజ్ఞతలు తెలిపారు

నియామక పత్రాన్ని సబ్ కలెక్టర్ కు ఇచ్చిన ఈసాభాష

దేవరగట్టులో భక్తుల రద్దీ

ప్రజాశక్తి- హొళగుంద

దేవరగట్టుకు భక్తులు ఆదివారం పెద్ద ఎత్తు రావడంతో సందడి నెలకొంది. ఆలూరు నియోజకవర్గం భక్తులే కాకుండా కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో తరలివచ్చి మాల మల్లేశ్వర లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం ఆరు గంటల నుండి పూజ కోసం బార్లు తీరిన భక్తులకు అర్చకులు మల్లయ్య మహేష్ స్వాములు మాల మల్లేశ్వరలకు అభిషేకం చేసి బండారు అర్చన ,బిల్వార్చన, కుంకుమార్చన చేశారు. భక్తులకు దేవరగట్టు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా హొలగుంద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రయివేట్ స్కూళ్ల ఫీజుల వేధింపులపై నిరసన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యా హక్కు చట్టం ద్వారా ప్రైవేటు స్కూల్స్‌లో ఉచిత విద్యకు ఎన్నికైన విద్యార్థులు ఫీజు కట్టాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్న ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సోమాజిక ఉద్యమ కార్యకర్త, న్యాయవాది తిమ్మప్ప డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్టీఈ ప్రైవేటు స్కూల్స్ పేరెంట్స్ అసోషియోషన్ ఆధ్వర్యంలో 9వ తేదీ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం చేస్తున్నామన్నారు.

హక్కుల కోసం పోరాడాలి : సిఐటియు

ప్రజాశక్తి - కౌతాళం

గ్రామ సేవకులు హక్కుల కోసం పోరాడాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య అన్నారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గ్రామ సేవకుల జనరల్ బాడీ సమావేశం నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఐక్యమత్యంతో హక్కులు సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగరాజు, మారెప్ప, రంగప్ప, చెన్నప్ప, శ్రీనివాసులు, తాయప్ప, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంక్షేమ హాస్టళ్లలో వేదిస్తున్న సమస్యలు

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

డ్యూటీ సమయంలో విధుల్లో లేని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ సంయుక్త ఉన్నతాధికారులను కోరారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కమిటీ సమావేశం ఎస్ఎఫ్ఐ ఆఫీసులో నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న బాలికల సంక్షేమ హాస్టల్లో మౌలిక సమస్యలు పరిష్కరించాలి. నిత్యం కస్తూరిబా హాస్టల్ లో విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు దుర్భరంగా తయారయ్యాయన్నారు. కనీస వసతులు లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంక్షేమ హాస్టల్ పరిసరాలలో విషపురుగులు, పాములు సంచరిస్తున్నాయన్నారు. సంక్షేమ హాస్టల్ లో ఉండాలంటే విద్యార్థులు భయాందోళన చెందే పరిస్థితులు హాస్టళ్లలో ఉన్నాయన్నారు. ఎస్ఎఫ్ఐ గర్ల్స్ బృందం హాస్టల్లో పర్యవేక్షణకు వెళ్తే హాస్టల్లో వార్డెన్లు సమయానికి

డ్యూటీలో లేరన్నారు. డ్యూటీలో లేని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని, మెనూ ప్రకారం భోజనం విద్యార్థులకు పెట్టాలని అధికారులను కోరారు. విద్యార్థినీలకు అనారోగ్యానికి గురవుతే సమయానికి హాస్పిటల్‌కు తీసుకుపోయే వాళ్లు హాస్టల్లో లేరన్నారు. వార్డెన్లు హాస్టల్లో సమయానికి ఉండడం లేదని, ఇప్పటికైనా విద్యార్థినిల సంక్షేమ హాస్టల్లో సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో గర్ల్స్ నాయకులు రేవతి, తులసి, మౌనిక, అక్షయ పాల్గొన్నారు.

మంత్రాలయంలో భక్తుల సందడి

ప్రజాశక్తి - మంత్రాలయం : ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని రాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై ఉన్న వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చిన అనంతరం ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మఠం ప్రాకారంలో ఘనంగా పల్లకోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సహాయక పిఆర్వో హొన్నాళ్ళి వ్యాసరాజాచార్, భక్తులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఉషూ పోటీలను ప్రారంభించిన టిజివి

ప్రజాశక్తి-కర్నూలు జిల్లా పరిషత్

స్థానిక కిడ్స్ వరల్డ్ రోశయ్య కమ్యూనిటీ హాలులో అదివారం జిల్లాస్థాయి ఉషూ పోటీలను రాజ్యసభ మాజీ సభ్యులు టిజి వెంకటేష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఉషూమార్షల్ ఆర్ట్స్ క్రీడలను చూస్తుంటే చాలా సంతోషంగా, గర్వ కారణంగా ఉందన్నారు. ఉషూ క్రీడాకారులను ఎప్పటికప్పుడు ప్రోత్సహించాలని, తాను కూడా ప్రోత్సహిస్తానని పిల్లలను ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందనలు తెలిపారు. జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి టి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ పోటీలలో 300 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ పోటీలకు అండర్ 12 ,15, 18 వయసు గల విభాగాలకు చెందిన బాల బాలికలకు

పోటీలను నిరస్తున్నామన్నారు. జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి జి శ్రీనివాసులు, రెఫరీలుగా సుధాకర్ , చిన్న శ్రీనివాసులు, అనుమతిశ్వర్ నాగ సులోచన ,మధు, మేఘన పాల్గొన్నారని జిల్లా సంఘం కార్యదర్శి టి శ్రీనివాసులు తెలిపారు.

చికెన్ వ్యర్థాలను నగరపాలక వాహనాలకే ఇవ్వాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగర పరిధిలో ఉన్న చికెన్ మాంసపు దుకాణదారులు తప్పనిసరిగా తమ దుకాణాల్లో వెలువడే వ్యర్థాలను నగరపాలక వాహనాలకే ఇవ్వాలని నగరపాలక ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. చికెన్ వ్యర్థాల నిర్వహణ కోసం టెండర్ వేసేంత వరకు తప్పనిసరిగా నగరపాలక సంస్థ వాహనాలకే వ్యర్థాలను ఇవ్వాలని తెలిపారు. ఇందుకు విరుద్ధంగా వ్యర్థాలను ఎవరైనా ప్రైవేటు వ్యక్తులకు ఇస్తున్నట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి షాపు ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు సీజ్ చేస్తామన్నారు. అదేవిధంగా వ్యర్థాలను సేకరించిన వాహనాలను సైతం సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాంసపు దుకాణదారులు నగరపాలక సంస్థకు సహకరించాలని ప్రజారోగ్య అధికారి విజ్ఞప్తి చేశారు.

మహారాజశ్రీ కర్నూలు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

ఓ.యస్. నెం. 203/2023

1.నంద్యాల గురుప్రసాద్
2.యన్. సావిత్రిబాయి. ...వాదులు

- ఎదురి -

టి.రామచంద్ర మరియు 18 మంది ఇతరులు. ...ప్రతివాదులు

3, 5, 17, ప్రతివాదులకు దావా సమన్లు

3.బి.రవి తండ్రి పెద్ద తిమ్మప్ప, ప్రస్తుత నివాసం, ఎనగండ్ల గ్రామం, సి.బెళగల్ మండలం, కర్నూలు జిల్లా.
5.తలారి.ఓబులేసు తండ్రి బోయ తలారి కరెన్న, ప్రస్తుత నివాసం, ఎనగండ్ల గ్రామం, సి.బెళగల్ మండలం, కర్నూలు జిల్లా.
17. గిడ్డయ్య తండ్రి వన్నూరప్ప,ప్రస్తుత నివాసం, ఎనగండ్ల గ్రామం, సి.బెళగల్ మండలం, కర్నూలు జిల్లా.

పై నెంబర్ దావాలో వాదులు. దావాలో కనపరిచిన షెడ్యూల్ దాఖల ఆస్తిని 19వ ప్రతివాది అక్రమంగా సంతకాలను ఫోర్జరీ చేసి డాక్యుమెంట్లను చేయించుకున్నారు. డాక్యుమెంట్లు చెల్లవని, అలాగే 20వ ప్రతివాది షెడ్యూల్ దాకా ఆస్తి ని రెవిన్యూ రికార్డ్స్ లో మార్పులు చేశారని ఈ మార్పులు చెల్లవని షెడ్యూల్ దాకా ఆస్తిని వాదులకే చెందవలెనని పై కోర్టులో దావా దాఖలు చేశారు.ఇందులో 3,5,17 ప్రతివాదులైన మీకు ఏమైనా ఆక్షేపణ ఉన్న యెడల 11-12- 2024 వ తేదీ పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుసుకొనవలెను. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును

“ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ”

వాయిదా : 11-12-2024

డి.ఆర్.మాలిక్ బాషా,
బంగి.సుధీర్,
వాదుల తరపు అడ్వకేట్లు, కర్నూలు.

IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE (SENIOR DIVISION): : ADONI
I. P. No. 4/2024

Between:
Shaik Shafi Basha, S/o Hussain Basha, H.No: 1-177, Rammana Peta, Yammiganur Mandal, Kurnool District. ...Petitioner

v/s

1.Boya Thayanna , S/o Boya Eranna, H.No:3/210, Mallaripeta, Gudikal Village, Yemmiganur Mandal, Kurnool District.
2.Kolantla Venketesh, S/o Naganna, H.No:3-292, Kumari Street, Yemmiganur Mandal, Kurnool District.
3.Mangali Nagendra Eresh, S/o Naganna, H.No:3-292, Kumari Street,Yemmiganur Mandal, Kurnool District.
4.Thatte Eresh, S/o Sikindrappa, H.No:1-81 B, Gachina Garadai Street, Gudikal Village, Yemmiganur Mandal, Kurnool District.
5. Boya Govindu, S/o Chinna Gorantla, H.No:9-20, Kota Street, Gudikal Village, Yemmiganur Mandal, Kurnool District.
6.Vanepogu Rathnam, S/o Narasanna, H.No:8-167, S.C Colony Gudikal Village, Yemmiganur Mandal, Kurnool District.
7.Boya Indra, S/o Boya Narasappa, H.No:3-222, YalammaTemple Street Gudikal Village, Yemmiganur Mandal, Kurnool District.
8.Boya Susheelappa , S/o Mondem Gunteppa H.No:4-15, Boya Street , Gudikal Village, Yemmiganur Mandal, Kurnool District.
9.Mone Rama Krishna, S/o Mone Venkateshappa, H.No:1-105 Teru Bazar Street , Gudikal Village, Yemmiganur Mandal, Kurnool District.
10.Boya Narasimhulu , S/o B.Anjaneya H.No:8-54A, Gudikal Village, Yemmiganur Mandal, Kurnool District.
11.Mangali Raghu Swamy S/o M.Govindu, H.No. 18-1122/1, Gibson Colony, Sarada Covent Road, 18th Ward, Yemmiganur Town, Kurnool District.
12)Boya Uligaiah Nagarjuna, S/o Boya Ranganna, H.No.3/155/A,Mallari Peta,Gudikal village, Yemmiganur Mandal, Kurnool District.

General Notice to Public

Whereas the above named petitioner filed the petition under Section 10 of Provincial Insolvency Act to declare him as insolvent. Hence, you are hereby required to appear before the Hon'ble Court on 20/12/2024 at 10.30 AM and answer the said petition, otherwise the petition will be decided exparte.

(By Court order)
Hearing Date: 20/12/2024

M.Babu Saheb,
B.Khalandar Basha,
N.Asif Basha,
Advocates for the Petitioner,
Adoni-518 301.
Mobile:9440710170.